క్లుప్తంగా

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా – 24 రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జీఎం జాన్‌ఆనంద్ సందర్శించి పరిశీలించారు. మంగళవారం ఇల్లెందు ఏరియా సింగరేణి అధికారులతో కలిసి పరిశీలించిన పలు సలహాలు, సూచనలు చేశారు. జెండా ఆవిష్కరణ, సెక్యూరిటీ సిబ్బందిచే గౌరవ వందనం, ఉత్తమ ఉద్యోగుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, హాజరయ్యే ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులకు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. జీఎం వెంట డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ఏరియా సివిల్ అధికారి రవికుమార్, వెంకటేశం, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులతో బదిలీ ఉపాధ్యాయులు

సుజాతనగర్: సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన పది మంది ఉపాధ్యాయులకు ఆ పాఠశాలలో మంగళవారం ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు ఏర్పాటు చేశారు. బదిలీ ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, బి.రేవతిదేవి, ఎం.సంధ్యారాణి, కె.సత్యవాణి, ఎం.రజనీకుమారి, ఎన్.మాధురి, పి.జీవకుమార్, ఎన్.ప్రభాకర్, ఏ.వెంకటేశ్వర్లు సేవలను కొనియాడారు.

కలెక్టర్‌కు సన్మానం



ప్రియాంకను సన్మానిస్తున్న ఉద్యోగులు

చుంచుపల్లి: జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, ఉద్యోగులు మంగళవారం ఐడీఓసీలో కలెక్టర్ ప్రియాంక అలను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సంఘం – 2024 క్యాలెండర్లను జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనంతుల లక్ష్మీనారాయణ, దూలం నటరాజ్, పసునూతి వెంకటేశ్వర్లు, చెన్న నాగేశ్వరరావు, ఉమేశ్వరి, కొండ సర్వేశ్వరరావు, కొండి పద్మజ, వేముల మురళి, వెల్దండి దుర్గాప్రసాద్, బాతాల వెంకటేశ్వర్లు, కుంట శంకరయ్య, కూచన మనోహర్, సంపత్ కుమార్, గంజి నిరంజన్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

టేకులపల్లి: పెండింగ్ బిల్లులు, నిధులు విడుదల చేసి పదవీ కాలాన్ని పొడిగించాలని సర్పంచ్‌లు కోరారు. ఈ మేరకు టేకులపల్లి మండలానికి చెందిన సర్పంచ్‌లు మంగళవారం కలెక్టర్ ప్రియాంక అలని కలిసి వినతిపత్రం అందజేశారు. సర్పంచ్‌లకు మొదటి పదవీకాలంలో మొదటి ఎనిమిది నెలల వరకు చెక్ పవర్ ఇవ్వలేదన్నారు. కరోనా కాలంలో రెండేళ్లు వృథా అయిందని వాపోయారు. ముద్రాస్‌తండా, గొల్లపల్లి, కొత్తతండా(జి),శంభునిగూడెం, మొక్కంపాడు, రామచంద్రునిపేట, రాంపురం, బిల్లుడుతండా సర్పంచ్‌లు మాలోతు రాజేందర్‌నాయక్, లావుడియా శంకర్, కేళి, బాయమ్మ, విజయ, ఉపేంద్రబాబు, భూక్యా ఇందిర, అజ్మీర గలక పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



స్పందనను అభినందిస్తున్న ఉమాశంకర్

ఇల్లెందు: గణితం టాలెంట్ టెస్ట్‌లో ఓ విద్యార్థిని ప్రతిభ చాటింది. శ్రీ శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా కొత్తగూడెం సింగరేణి స్కూల్‌లో నిర్వహించిన గణితం టాలెంట్ టెస్ట్‌లో ఇల్లెందు సుభాష్ నగర్ హైస్కూల్ పదో తరగతి తెలుగు మీడియం విద్యార్థిని జే.స్పందన జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. మంగళవారం పాఠశాలలో స్పందనను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాశంకర్, టీచర్లు, ఎంఈఓ పిల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కల్యాణి, వి.నాగేశ్వరరావు, ఎం.రమాదేవి పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

- మూడేళ్ల క్రితం రూ.84లక్షలు మంజూరు
- టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల వెనకడుగు
- రోడ్లపై గుంతలతో ప్రమాదకరంగా రాకపోకలు
- పట్టించుకోని పంచాయతీరాజ్ శాఖ అధికారులు



కంకర తేలి అధ్వానంగా మారిన నర్సింహాసాగర్ రోడ్డు

పాల్వంచరూరల్: మారుమూల గిరిజన గ్రామాలకు మూడు సంవత్సరాల క్రితం రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరైనా టెండర్లు పూర్తికాకపోవడంతో నిధులు వెనక్కు వెళ్లాయి. మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాలైన లక్ష్మీదేవిపల్లి నుంచి మల్లారం, నర్సింహాసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు చాలా సంవత్సరాల క్రితం నిర్మాణం చేయడంతో నేడు అధ్వానంగా మారాయి. రోడ్లపై పలుచోట్ల కంకర తేలి, గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారాయి. వర్షం పడితే గుంతల్లో నీరు నిలుస్తుంది. ఏ గుంత ఎక్కడ, ఎంత ఉందో తెలియని పరిస్థితి. అయినా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. రహదారి నిర్వహణను పట్టించుకోవడం లేదు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదార్లు దెబ్బతినడం వలన వాహనదారులు, ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

మంజూరై మూడేళ్లయినా...

ఎంఆర్ఎర్ స్కీమ్ కింద లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి మల్లారం గ్రామం వరకు మూడు కిలోమీటర్లకు రూ.62 లక్షలు... నర్సింహాసాగర్ గ్రామం వరకు ఒక కిలోమీటరుకు రూ.22లక్షలు మంజూరయ్యాయి. మూడు సంవత్సరాలుగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ రెండు రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయి.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు...

మల్లారం, నర్సింహాసాగర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మధ్య వాగులు ఉండటం వలన వర్షాకాలంలో వరదలకు లోలెవల్ చప్టాల వద్ద వరద ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఈ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే చప్టాల మీదుగా వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో మండల కేంద్రం పాల్వంచకు రాకపోకలు నిలిచిపోతాయి. ఎంత అత్యవసరమైనా చేసేదేమీ లేదు. ఎన్నికలు వచ్చినప్పుడు నాయకులు హామీలకే పరిమితం అవుతారని స్థానికులు వాపోతున్నారు.



గుంతలతో మల్లారం రహదారి

రోడ్డు నిర్మాణం చేయాలి



మల్లారం నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు వరకు మూడు కిలోమీటర్ల రహదారిపై కంకర తేలి, గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రోడ్డు నిర్మాణం చేయాలని అధికారులకు, రాజకీయ నేతలకు అనేకసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– కాలం నర్సింహారావు, నర్సింహాసాగర్

ప్రమాదకరంగా రాకపోకలు



లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి నర్సింహాసాగర్ గ్రామం వరకు రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలక ఇబ్బందిగా ఉంది. గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందోనని భయంగా ఉంది. వర్షాకాలంలో వాగు వస్తే రాకపోకలు ఆగిపోతున్నాయి. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కాలం పాపయ్య, లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డు

కాంట్రాక్టర్లు రావడం లేదు..



2020లో ఎంఆర్ఆర్ స్కీమ్ కింద లక్ష్మీదేవిపల్లి క్రాస్ రోడ్డు నుంచి మల్లారం గ్రామం వరకు రూ.62లక్షలు, నర్సింహాసాగర్ నుంచి లక్ష్మీదేవిపల్లి క్రాస్‌రోడ్డు వరకు రూ.22లక్షలతో బీటీ రోడ్లు మంజూరయ్యాయి. నాలుగు సార్లు టెండర్లు పిలిచాము. కాంట్రాక్ట ర్లు ఎవరూ రాలేదు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేకపోయాము.

– అనిల్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ ఏఈ

భూగర్భ గనులు ఏర్పాటు చేయండి



సీఎండీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కోల్‌బెల్ట్ ప్రాంతాల్లో ప్రతిపాదనలో ఉన్న నూతన ప్రాజెక్టులతో పాటు కొత్త భూగర్భ గనుల ఏర్పాటుపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలని, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌ను కోరారు. మంగళవారం కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ బృందం సీఎండీతో పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... గడిచిన దశాబ్ద కాలంగా ఒక్క నూతన భూగర్భ గని కూడా ప్రారంభించ లేదని, గత ప్రభుత్వం నూతన గనులు ఏర్పాటు చేస్తామన్న హామీ అమలు చేయలేదన్నారు. సింగరేణి ప్రాంతాల్లో ఎంతోమంది యువకులు ఉపాధి లేక వలసబాట పట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బొగ్గు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరారు. కార్మికుల సొంతింటి పథకంపై యాజమాన్యం దృష్టి సారించాలని, ఉద్యోగ విరమణ అనంతరం అద్దె ఇళ్లల్లో ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోందన్నారు. సీఎస్సార్ నిధులతో ప్రాజెక్ట్, ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, సింగరేణి అస్పత్రులను బలోపేతం చేసి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

సుజాతనగర్: స్థానిక శ్రీ ఫార్మసీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు షీ టీమ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఎస్‌ఐ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాలికల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమన్నారు. కళాశాలలో, బయట ఎక్కడైనా ఆకతాయిలు భయాందోళనకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడినా... వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181కి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాలికలను వేధింపులకు గురిచేసినా, అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు చిన్నచిన్న విషయాలకే ఆవేదనకు గురికాకుండా మంచి ఆలోచనతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మై చాయిస్ ఫౌండేషన్ ఫ్రీ ట్రైనర్ ఎం.సింధు, షీ టీం ఎస్సై పి.రమాదేవి, రాంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం..

పాల్వంచ: హిట్ అండ్ రన్ అనే కొత్త చట్టాన్ని తీసుకొచ్చి ప్రైవేట్ వాహన డ్రైవర్లకు గుదిబండగా చేసి వారి పొట్టకొడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేశారు. మాట్లాడుతూ... ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం మంచిదే కానీ, ఆటోల మీదనే ఆధారపడి చాలా కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఆటో డ్రైవర్ల జీవన భృతికి నెలకు రూ.4,500 ఇవ్వాలన్నారు. ఆటో ఓనర్స్, డ్రైవర్ల యూనియన్, అధ్యక్ష, కార్యదర్శి రాంబాబు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

టేకులపల్లి: ఈనెల 29న భద్రాచలం పట్టణంలో జరిగే ప్రతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి జె.గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. మాట్లాడుతూ... నేడు దేశంలో బీజేపీ ప్రభుత్వం నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తూ విద్యార్థులను మతోన్మాదులుగా తయారు చేస్తోందని, రాష్ట్రంలో గత ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్య అంటూ ప్రభుత్వ విద్యారంగానికి తక్కువ బడ్జెట్ కేటాయిస్తూ ప్రభుత్వ విద్యను నీరుగార్చిందని విమర్శించారు. కార్పొరేట్ విద్యకు ఎర్ర తివాచీ పరుస్తూ తక్కువ పెట్టుబడితో ఉండే ప్రైవేట్ విద్యా సంస్థలను ధ్వంసం చేసిందన్నారు. రాష్ట్రంలో రూ.వేల కోట్ల విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ నేటికీ పెండింగ్‌లో ఉన్నాయని ఈ సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో హేమలత, వైష్ణవి, మధులత, కార్తీక్, భరత్ , హరీష్, దేవేందర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో స్థానం



శివయ్య

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వ రవాణాశాఖ కానిస్టేబుళ్ల యూనియన్ నూతన కమిటీని హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఎన్నుకున్నారు. ఈ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పాల్వంచ ఆర్‌టీఏ చెక్‌పోస్టులో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ నంది శివయ్యకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా మంగళవారం ఆయనను ఉద్యోగులు అభినందించారు.

నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి రాజీవ్‌కుమార్ కార్యదర్శులను హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పల్లెప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెప్రగతి పనులను నిర్లక్ష్యం చేయవద్దని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి సెల్‌ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించిన పోలీసులు అప్పగించారు. కొత్తగూడెంకు చెందిన మద్దల వెంకటరావుకు ఈనెల 18న సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో ఆయన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఫోన్‌ను స్వాధీనం చేసుకోగా మంగళవారం వెంకటరావుకు సీఐ ఎం.కరుణాకర్ అప్పగించారు.

రోడ్లపై వేడుకలు నిర్వహిస్తే చర్యలు

కొత్తగూడెంటౌన్: సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా ఎవరైనా పుట్టినరోజు వేడుకలను రోడ్లపై జరుపుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పుట్టినరోజు, యూత్‌ల పేరిట రోడ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కేసులు పెట్టడం జరుగుతుందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు

చుంచుపల్లి: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి అన్నారు. మంగళవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచుల కీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ ఐదేళ్ల కాలంలో పంచాయతీలను ప్రగతి పథంలో నడిపించారన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీటిపై అధికారులు వెంటనే స్పందించాలన్నారు. ప్రజా ప్రతినిధులు తమ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా అధికారులు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా..



ఎమ్మెల్యే కోరం కనకయ్యను సత్కరిస్తున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి ఉంటుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రియదర్శిని స్కూల్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఘనంగా సన్మానం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణాల్లో కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.లక్షల ఫీజులు చెల్లించి చదివిస్తున్న ఈ తరుణంలో మారుమూల పల్లెల్లో నివసించే పేదలకు అందుబాటులో తక్కువ ఫీజులతో ప్రైవేట్ పాఠశాలలు నెలకొల్పి విద్యను అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాన్ని అభినందించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ పత్తి స్వప్న, ప్రైవేట్ పాఠశాలలు కరస్పాండెంట్లు తుమ్మలపల్లి ప్రసాద్, వెంకటస్వామి, సుంకరబోయిన సత్యనారాయణ, నామా సుధాకర్, మహేందర్, అర్వపల్లి రాధాకృష్ణ, దండా రామచందర్, జక్కుల సర్వేశ్వరరావు, ఒంగూరి శ్రీనివాస్, రామకృష్ణ, అరుణోదయ సుధాకర్, జవహర్ సాయి, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో..

ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్యను తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం ఇల్లెందులోని జేకే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసిన బృందం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సత్కరించారు.

కార్మికులకు రూ.కోటి ప్రమాద బీమా

సింగరేణి(కొత్తగూడెం): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో సాలరీ అకౌంట్ ఉన్న సింగరేణి ఉద్యోగులందరికీ అకౌంట్ ఆధారంగా ప్రీమియం లేకుండా రూ.కోటి ప్రమాద బీమా వర్తింపజేయనున్నారని జీఎం పర్సనల్ (వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో ఆ బ్యాంకు అధికారులతో, సింగరేణి అధికారులు నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ చొరవతో బ్యాంకు నిర్వాహకులతో ఒప్పందం కుదిరిందన్నారు. ఏజీఎం పర్సనల్ కే.శ్రీనివాసరావు, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, ఖమ్మం రీజినల్ హెడ్ ఏ.హనుమంతరెడ్డి, చీఫ్ బ్రాంచ్ మేనేజర్లు జి.కిషన్, అసిస్టెంట్ మేనేజర్ నాగేందర్‌బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన శైలజ



నివాళులర్పిస్తున్న డీఈఓ తదితరులు

టేకులపల్లి: అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించిన శైలజ ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారని డీఈఓ వెంకటేశ్వరాచారి పేర్కొన్నారు. టేకులపల్లి మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఆదిమూలపు శైలజ అక్టోబర్ 23న గుండెపోటుతో మృతి చెందగా, మంగళవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యాన బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శైలజ చిత్రపటం వద్ద డీఈఓ, ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాగరాజశేఖర్, మాధవరావు, డి.వెంకటేశ్వరరావు, బానోతు రవి, బీఎం.నిర్మల, జి.మోతీలాల్, సర్కార్, వరలక్ష్మి, మోకాళ్ల శ్రీనివాస్‌రావు, సమ్మయ్య, జి.హరిలాల్, వి.హత్తీరాం, మంగీలాల్, డి.రమేష్, పి.నర్సయ్య, రవీందర్, ప్రసాద్ పాల్గొన్నారు.

సాంస్కృతిక ప్రదర్శనలకు ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈనెల 26న, నిర్వహించే 75వ, గణతంత్ర దినోత్సవ ప్రధాన వేడుకలలో ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలను మంగళవారం వెల్ఫేర్ అధికారులు కొత్తగూడెంలోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డివైపిఎం శివకుమార్ మాట్లాడుతూ ప్రధాన వేడుకలకు హాజరయ్యే అహుతులను అలరించే విదంగా ఉండాలని అందుకు తగిన విద ంగా ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఈ ఎంపికలు కొత్తగూడెం పట్టణంలోని వివిద పాఠశాలలు, కళాశాలల నుండి వచ్చిన విద్యార్దిని విద్యార్దులు ఎంతో ఉత్సాహంగా సాంస్కృతిక ప్రదర్శనలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీకే కిరణ్‌కు మార్, స్కౌట్స్ అండ్ గైడ్స్, విద్యార్దులు పాల్గొన్నారు.

రామ్మూర్తి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఇల్లెందురూరల్: సాయినపల్లి గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన బొమ్మెర రామ్మూర్తి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఇఫ్టూ అనుబంధ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జటంగి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి తొగర సామేలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పంచాయతీ కార్మికులు నల్లబ్యాడ్జిలు ధరించి సంతాపం తెలిపారు. మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి రామ్మూర్తి మృతి చెందాడని, కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కిరణ్, మోహన్‌రావు, రామారావు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై బీజేపీ వైఖరి గర్హనీయం



కొత్తగూడెంరూరల్: కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఇల్లెందు: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్రకు వస్తున్న ఆదరణ ఓర్వలేక బీజేపీ శ్రేణులు వ్యవహరిస్తున్న తీరు గర్హనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. అసోంలోని ఆలయంలోకి రాహుల్ వెళ్లే సమయాన జరిగిన ఘటనను నిరసిస్తూ మంగళవారం ఇల్లెందులో కాంగ్రెస్ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యాన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కనకయ్య మాట్లాడుతూ రాహుల్‌గాంధీ నిర్వహిస్తున్న యాత్రను విచ్ఛిన్నం చేయాలనే బీజేపీ నాయకులు కుట్ర పన్నారని ఆరోపించారు. దొడ్డా డానియేల్, పులి సైదులు, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, యదళ్లపల్లి అనసూర్య పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వాన శాంతియుత ర్యాలీ జరుగుతుండగా అసోంలో బీజేపీ శ్రేణులు అడ్డుకోవడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో మంగళవారం యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. గడ్డం రాజశేఖర్, ఏడాది ప్రదీప్‌కుమార్, అజ్మీరా సురేష్‌నాయక్, మహమ్మద్ ఉస్మాన్, శివకుమార్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: అసోంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ యాత్రపై బీజేపీ గూండాలు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. లకావత్ లచ్చు నాయక్, చాపలమడుగు నరసింహారావు, రామిశెట్టి రాంబాబు, పూర్ణకంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భారత స్వాతంత్ర్య సేనాని సుభాష్ చంద్రబోస్

సుభాష్‌చంద్ర బోస్ 127వ జయంతిని మంగళవారం వివిధ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. స్వరాజ్యస్థాపనకై ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి స్వరాజ్య సిద్ధికి కారకుడయ్యారని, ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని ఆకాంక్షించారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంరూరల్: త్రివేణి పాఠశాలలో..



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య



చుంచుపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ తదితరులు



పాల్వంచ: ప్రభుత్వాస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేస్తున్న డాక్టర్ సోమరాజు దొర



పాల్వంచరూరల్: గురుకుల కళాశాలలో...